క్లుప్తంగా

శాంతి భద్రతలను పరిరక్షించాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ రాణి సుష్మిత

కళ్యాణదుర్గం రూరల్: శాంతి భద్రతలను పరిరక్షించాలని ఆర్డీఓ రాణిసుస్మిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నియోజకవర్గంలోని తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, మండల సర్వేయర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని గనులు, ఇసుక తవ్వకాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మండలాల్లో శాంతిభద్రతలను పటిష్టం చేయాలని అధికారులకు సూచించారు. కర్ణాటక సరిహద్దు ప్రాంతాలల్లో కర్ణాటక మద్యం అక్రమ రవాణను అరికట్టాలన్నారు. తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజలకు సత్వర సేవలందించేలా కార్యాలయాలను నిర్వహించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

రథం పరిశీలన



పెన్నహోబిలంలో పాత రథాన్ని పరిశీలిస్తున్న ఆర్అండ్‌బీ జేఈ కావ్య

ఉరవకొండ: పెన్నహోబిలంలోని లక్ష్మీ నృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో రథోత్సవానికి ఉపయోగించే పాత రథాన్ని ఆర్అండ్‌బీ జేఈ కావ్య బుధవారం పరిశీలించారు. పాత రథానికి చేసిన మరమ్మతులను ఆలయ ఈఓ విజయ్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్అండ్‌బీ సిబ్బందితో కలసి రథం కింది భాగం పటిష్టంగా ఉందా లేదా అని పరిశీలించారు. రథానికి మరమ్మతులు చేసిన ఆచారిను పిలిపించి చిన్న చిన్న మరమ్మతులు ఉంటే జాగ్రత్తగా చేసుకోవాలన్నారు. అనంతరం జేఈ మాట్లాడుతూ.. రథం ట్రయిల్ రన్ విజయవంతం అయిందన్నారు. నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కుడా మంజురు చేస్తామన్నారు.

మార్మోగిన పెద్దమ్మ నామస్మరణ



అలంకరణలో పెద్దమ్మ దేవత

కూడేరు: మండల పరిధిలోని ఇప్పేరు గ్రామంలో పెద్దమ్మ దేవి నామస్మరణ మార్మోగింది. బుధవారం పెద్దమ్మ దేవి ఊరు దేవరను గ్రామస్తులు కనుల పండువగా జరుపుకున్నారు. దేవరకు గ్రామస్తులు తమ బంధు,మిత్రులను ఆహ్వానించడంతో పెద్ద ఎత్తున తరలి వచ్చారు. దీంతో ఇప్పేరు గ్రామం జనసంద్రమైంది. పెద్దమ్మ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టువస్త్రాలు, పుష్పాలతో విశేషంగా అలంకరించారు. భక్తిశ్రద్ధలతో ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు. వర్షాలు బాగా కురిసి పంటలు ఆశించిన స్థాయిలో పండి గ్రామం సుభిక్షంగా ఉండేలా చూడు తల్లీ అంటూ అమ్మవారిని వేడుకున్నారు. జంతువును బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ శివరాముడు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

రేపు పాలిసెట్ వెబ్ కౌన్సెలింగ్‌పై అవగాహన

ఉరవకొండ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన పాలిసెట్-2024 వెబ్ కౌన్సెలింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అశ్రాఫ్‌అలీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవగాహన సదస్సుకు పాలిటెక్నిక్‌లో ర్యాంకు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరుకావాలన్నారు. ఆన్‌లైన్ ఫీజు చెల్లింపు ప్రక్రియ, ధృవపత్రాల పరిశీలన విధానం, ఆప్షన్ల నమోదు, రద్దు తదితర విషయాలపై సీనియర్ అధ్యాపకులు వై.సురేష్ బాబు, సులోచన వివరిస్తారని పేర్కొన్నారు.

మూఢనమ్మకాలు వీడాలి



మాట్లాడుతున్న జేవీవీ నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: మూఢనమ్మకాలను వీడాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గేయానంద్ సూచించారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కంబాల తిమ్మారెడ్డి అధ్యక్షతన మూఢనమ్మకాలు శాస్త్రీయ విశ్లేషణ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గేయానంద్ మాట్లాడుతూ...ప్రస్తుతం మన సమాజంలో నెలకొన్న అనేక రకాల మూఢనమ్మకాలు, మూఢవిశ్వాసాల నిర్మూలనకు విద్యార్థులు సైన్సుపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా గౌరవ సలహాదారు మల్లికార్జున, జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు చిత్తప్ప, జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కమనీయం.. నృసింహుడి కల్యాణం



రాయదుర్గం రూరల్: అలంకరణలో లక్ష్మీ నరసింహస్వామి



రాయదుర్గం రూరల్: నృసింహుడికి కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు



కణేకల్లు: లక్ష్మీనరసింహ స్వామికి కల్యాణం జరిపించిన దృశ్యం

రాయదుర్గం రూరల్: మండలంలోని మల్లాపురం గ్రామ పరిధిలో వెలిసిన విప్రమలై లక్ష్మీనవనరసింహ స్వామి కల్యాణోత్సవం బుధవారం కనుల పండువగా సాగింది. ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, ఆకుపూజ, నైవేద్య పూజలు చేపట్టారు. అనంతరం ఉదయం 12 గంటలకు ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు రామ్మూర్తి స్వామీజీ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్య స్వామి, హరి ప్రసాద్ భరద్వాజ్ తదితరులు లక్ష్మీనవనరసింహ స్వామికి కల్యాణం జరిపించారు. పరిసర ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక నుంచి భక్తులు తరలివచ్చి స్వామి కల్యాణం తిలకించారు. మహామంగళ హారతి అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదం అందజేశారు.

కుందుర్పిలో..

కుందుర్పి: మండల కేంద్రంలో లక్ష్మీ నృసింహ స్వామి జయంతి బుధవారం ఘనంగా జరిగింది. ఉదయం స్వామికి అభిషేకం, హోమం, మధ్యాహ్నం 12 గంటలకు స్వామి కల్యాణం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం స్వామి గ్రామోత్సవం తదితర కార్యక్రమాలు చేపట్టారు. కర్ణాటక, తమిళనాడు నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సత్యనారాయణ శాస్త్రి, సర్పంచ్ మారుతేశ్వరి, ఎంపీటీసీ సభ్యుడు హనుమంత రాయుడు తదితరులు పాల్గొన్నారు.

నృసింహుడికి పూజలు

కణేకల్లు: స్థానిక లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో బుధవారం స్వామి వారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. కళ్యాణోత్సవ వేడుకలను పురస్కరించుకుని అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవ, నిర్మాల్య విసర్జన, పంచామృతాభిషేకం చేపట్టారు. అర్చకులు వెంకట రమణాచార్యులు, రాజూ గురురాజాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం 10:30 గంటల సమయంలో వేదమంత్రోచ్చరణాల నడుమ కల్యాణాన్ని జరిపించారు. భక్తులు ఈ వేడుకలను కనులారా తిలకించి భక్తి పారవశ్యంతో మురిసిపోయారు. అనంతరం స్వామికి పూజలు జరిపించి మొక్కులు చెల్లించుకున్నారు.

బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై ఆరా



ఉరవకొండ: నరసింహస్వామిని దర్శించుకుంటున్న అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

ఉరవకొండ: పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామిని జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న బుధవారం దర్శించుకున్నారు. స్వామికి ప్రత్యేక పూజలనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు ద్వారక నాథాచార్యులు ఆలయ విశిష్టతను వివరించారు. అనంతరం జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఆరా తీశారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని ఆలయ ఈఓ కె.విజయ్ కుమార్‌ను ఆదేశించారు.

సూర్యప్రభ వాహనంపై వేంకట రమణుడు



సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శమిచ్చిన ప్రసన్న వేంకటరమడుడు



పురవీధుల్లో స్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో వెలసిన కలియుగ దైవం ప్రసన్న వేంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సూర్యప్రభ వాహనంపై శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం శ్రీవారిని సింహ వాహనంపై పుర వీధుల్లో ఊరేగించారు. అంతకుముందు ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. సాయంత్రం బలిజ సంఘం ఆధ్వర్యంలో మేళతాళాలతో స్వామిని ఊరేగించారు. కోట, మొలకాల్మూరు రోడ్డు, వినాయక సర్కిల్, పాతబస్టాండ్, లక్ష్మీబజార్ మీదుగా కొనసాగి తిరిగి ఆలయానికి చేరుకుంది. ఉత్సవాల్లో భాగంగా గురువారం శ్రీవారి శేష వాహనోత్సవ కార్యక్రమం ఉంటుందని ఈఓ నరసింహారెడ్డి తెలిపారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ అల్లాబకాష్

రాయదుర్గం రూరల్: వర్షాలు కురుస్తుండటంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో తాగు నీటి లీకేజీలు అరికట్టాలి. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ విద్యావతి సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలను సభ్యులకు వివరించారు. మండలంలో 15 వేల జాబ్‌కార్డులు ఉండగా.. ఉపాధి కూలీల సంఖ్య 4,500 దాటడం లేదన్నారు. గతంలో ఉపాధి కూలీ రూ.272 ఇస్తుండగా ప్రస్తుతం రూ.300 ఇస్తున్నట్లు ఎంపీడీఓ అల్లాబకాష్ తెలిపారు. అలాగే గ్రామాల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. హరిత సిబ్బందితో వీధులు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, డ్రైనేజీలను శుభ్రం చేసేలా సర్పంచ్, ఎంపీటీసీల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నందున సేద్యపు పనుల్లో నిమగ్నమైన రైతులు విత్తన వేరుశనగ కోసం రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని ఏఓ మహేంద్ర సూచించారు. వర్షాకాలంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసకుంటున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ బాలచందర్ తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శాంతాబాయి, ఏఓ చిక్కణ్ణ, ఈఓపీఆర్డీ రంగనాయకులు, వివిధ శాఖలకు చెందిన మండలాధికారులు, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలకు ఇబ్బందులు

విడపనకల్లు: అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ తాలూకా సహాయ కార్యదర్శి చెంద్రాయుడు, రైతులు, విద్యార్థులు జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. బుధవారం మండల పర్యటనకు వచ్చిన జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎన్నికల సాకుతో అధికారులు విధులు నిర్వర్తించడం లేదన్నారు. పాసు పుస్తకాలు, వన్‌బీ అడంగల్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల మంజూరుకు ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షణలు చేసినా కూడా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. విద్యార్థులు, రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసుల రెడ్డి, తదితర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక పనులు చేస్తే చర్యలు



అయ్యగార్లపల్లిలో సోదాలు చేపట్టిన పోలీసులు

శెట్టూరు: చట్ట వ్యతిరేక పనులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐలు చంద్రశేఖర్, హరినాథ్ హెచ్చరించారు. బుధవారం మండల పరిధిలోని అయ్యగార్లపల్లి గ్రామంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ప్రతి వీధిని, అనుమానిత స్థలాలను జల్లెడ పట్టారు. నేర చరిత్ర ఉన్న వ్యక్తులు, వారి ఇళ్లను సోదా చేశారు. అక్రమ మద్యం ఇతరాత్ర చట్టవ్యతిరేక పనులు చేస్తున్న వ్యక్తులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఎన్నికల ఫలితాలు వచ్చాక గ్రామంలో శాంతియుతంగా ఉండాలని సూచించారు. అల్లర్లకు పాల్పడితే జైలుకు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో కుందుర్పి, బ్రహ్మసముద్రం ఎస్ఐలు వెంకట స్వామి, పరుశురాముడు, పోలీసు బలగాలు పాల్గొన్నాయి.

ఫారంపాండ్ పనులు చేపట్టాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ అల్లాబకాష్

రాయదుర్గం రూరల్: మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో ఫారంపాండ్ పనులు చేపట్టాలని ఎంపీడీఓ అల్లాబకాష్ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. అమృత్ సరోవర్, మినీ అమృత్ సరోవర్ పనులు చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారన్నారు. ఉపాధి పనులు కల్పించడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీఓ దేవరాజు, ఈసీ నాగభూషణం, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

శాంతిభద్రతలపై సమీక్ష



మాట్లాడుతున్న తహసీల్దార్ రామాంజినమ్మ

బొమ్మనహాళ్: మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ రామాంజినమ్మ, ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో వీఆర్వోలు, వీఆర్ఏలు, పోలిస్ సిబ్బందితో శాంతిభద్రతలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. బొమ్మనహాళ్ మండలంలో ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందన్నారు. కౌంటింగ్ పూర్తయిన జూన్ 25 వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. గ్రామాల్లో గుంపులు, గుంపులుగా ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో అనుమతులు లేకుండా సమావేశాలు ఏర్పాటు చేసినా.. ఏవైనా గొడవలు జరిగిన తమ దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి సూచించారు. గెలుపు, ఓటములపై గొడవలు జరిగే ఆస్కారం ఉందని గ్రామాల్లో జాగ్రత్తగా ఉండాలన్నారు. గెలిచిన పార్టీల కార్యకర్తలు సంబరాలు చేసుకోకుండా, టపాసులు కాల్చకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సుజాత, వీఆర్ఓలు నరసింహమూర్తి, సుజాత, యుగంధర్, శృతి, రామన్న, రవి, పోలీస్ సిబ్బంది తిమ్మప్ప, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

శెట్టూరు: మండల పరిధిలోని చెర్లోపల్లిలో బోయ సాకమ్మ అనే వివాహిత బుధవారం ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మాలేపల్లి గ్రామానికి చెందిన బోయ చిరంజీవితో పదేళ్ల క్రితం సాకమ్మకు వివాహం జరిగింది. కుటుంబంలో గొడవ జరగడంతో మనస్థాపానికి గురైన సాకమ్మ పురుగు మందు సేవించి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను కళ్యాణదుర్గం ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిశీలించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు.

ఊపందుకున్న వేరుశనగ రిజిస్ట్రేషన్



కూడేరు: ఆర్బీకేలో సబ్సిడీ విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్ చేస్తున్న వీహెచ్‌ఏ సాజియా

కూడేరు: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసేందుకు 40 శాతంతో సబ్సిడీతో విత్తన వేరుశనగ అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మండల వ్యవసాయాధికారి విజయకుమార్ తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లో విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్లు ఊపందుకున్నాయని పేర్కొన్నారు. బుధవారం నాటికి 12 ఆర్బీకేల్లో 531 మంది 476 క్వింటాళ్ల వేరుశనగకు రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు వెల్లడించారు. గత ఏడాది 2,200 క్వింటాళ్ల వేరుశనగను రైతులకు అందించినట్లు తెలిపారు. ఈ ఏడాది మండలానికి 3 వేల క్వింటాళ్ల వేరుశనగ కావాలని ప్రతిపాదనలు పంపగా.. 2,500 క్వింటాళ్ల కే-6 రకం వేరుశనగను ప్రభుత్వం సరఫరా చేసిందన్నారు. విత్తన కాయలు కావాల్సిన రైతులు వెంటనే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. త్వరలోనే విత్తనకాయలు సరఫరా చేస్తామన్నారు.

రేపటి నుంచి వేరుశనగ పంపిణీ

కుందుర్పి: కళ్యాణదుర్గం డివిజన్ వ్యాప్తంగా ఐదు మండలాల్లో శుక్రవారం విత్తన వేరుశనగ పంపిణీ చేస్తున్నట్లు ఏడీఏ యల్లప్ప బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నాలుగు రోజులుగా ఐదు మండలాల్లో 680 మంది రైతులు విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు పేర్కొన్నారు. కుందుర్పి 3,900 క్వింటాళ్లు, బ్రహ్మసముద్రం 4,400 క్వింటాళ్లు, కంబదూరు 3,000 క్వింటాళ్లు, శెట్టూరు 4,300 క్వింటాళ్లు, కళ్యాణదుర్గం 4,400 క్వింటాళ్లు మొత్తం 20 వేల క్వింటాళ్లను మొదటి విడతలో పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు.

ఉరవకొండ: మండల పరిధిలోని షేక్షానుపల్లి ఆర్‌బీకేలోని విత్తన వేరుశనగ స్టాక్‌తో పాటు రిజిస్ట్రేషన్ ప్రక్రియను బుధవారం మండల వ్యవసాయ శాఖ అధికారి శుభకర్ పరిశీలించారు. ఈనెల 24 నుంచి విత్తన వేరుశనగ పంపిణీ ప్రారంభం అవుతుందని తెలిపారు. సమన్వయం పాటించి విత్తనాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీకే సిబ్బంది చిక్కన్న, గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్య



నారాయణ స్వామి

ఉరవకొండ: మండల పరిధిలోని చిన్నముస్టూరు గ్రామానికి చెందిన రైతు నారాయణ స్వామి (55) బుధవారం అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణ స్వామి తనకున్న మూడు ఎకరాల పొలం, మరో 5 ఎకరాలను కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తున్నాడు. గత రెండేళ్లుగా వేరుశనగ పంట చేతికందగా పంటకు పెట్టిన పెట్టుబడులు కుడా రాక అప్పులపాలయ్యాడు. వాటిని తీర్చే దారి లేక మనస్థాపానికి గురయ్యాడు. బుధవారం మోడల్ స్కూల్ దారిలో ఓ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఏఎస్ఐ శ్రీశైలం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతునికి భార్య ఈశ్వరమ్మతో పాటు నలుగురు ఆడపిల్లలు ఉన్నారు.

ఉరుములు, మెరుపులకు గొర్రెల మృతి

బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహొన్నూరు గ్రామంలో మంగళవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి 10 గొర్రెలు మృతి చెందినట్లు బాధితులు తెలిపారు. గ్రామానికి చెందిన బోయ వన్నూరు స్వామి, కురుబ వన్నప్ప, కురుబ ముద్దప్పకు చెందిన గొర్రెలు, మేకలు పెంపకం ద్వారా జీవనం సాగిస్తున్నారు. మంగళవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ శబ్దానికి బెదిరి గొర్రెలు మృత్యువాత పడినట్లు బాధితులు తెలిపారు. రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందన్నారు.

80 టెట్రా ప్యాకెట్ల పట్టివేత

వజ్రకరూరు: మండలంలోని కొనకొండ్ల గ్రామంలో బుధవారం సాయంత్రం 80 టెట్రా ప్యాకెట్లను పట్టుకున్నట్లు ఎస్ఐ నరేష్ వెల్లడించారు. కొనకొండ్ల గ్రామానికి చెందిన చంద్రబాబును అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇద్దరు నేరస్తుల జిల్లా బహిష్కరణ



ఎరుకుల ముత్యాలన్న



ఎరుకుల రాజశేఖర్

కంబదూరు: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ మండల ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న ఇద్దరు నేరస్తులను జిల్లా నుంచి బహిష్కరించారు. గుండా గిరి, రౌడీయిజం చేస్తున్న ఎరుకుల ముత్యాలన్న (జోల్లోడు), ఎరుకుల రాజశేఖర్ (గుండబండ) అనే ఇద్దరు నేరస్తులను జిల్లా ఎస్పీ గౌతమిశాలి సూచనల మేరకు జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశాలతో మూడు నెలల పాటు జిల్లా బహిష్కరణ చేశామని ఎస్ఐ ఆంజనేయులు బుధవారం విలేకరులకు తెలిపారు. మండలంలో ఇంకా ఎవరైనా కర్ణాటక మద్యం విక్రయించడం, నాటుసారా తయారీ చేయడం, జూదం ఆడటం, గుండాగిరి ద్వారా ప్రజలను బెదిరించడం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రేపటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ

- రాయదుర్గంలో రెండు పరీక్ష కేంద్రాల ఏర్పాటు

రాయదుర్గంటౌన్: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఈనెల 24వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఏపీ మోడల్ స్కూల్‌లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్స్ వీరేష్, వెంకటేశులు తెలిపారు. ఈనెల 31వ తేదీ వరకూ పరీక్షలు జరుగుతాయన్నారు. పట్టణంతో పాటు రాయదుర్గం రూరల్, గుమ్మఘట్ట మండలానికి చెందిన సప్లిమెంటరీ విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల దాకా మొదటి సంవత్సరం విద్యార్థులకు, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి 5:30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు జరుగుతాయన్నారు. అలాగే ఏపీ మోడల్ స్కూల్ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల దాకా కేవలం మొదటి సంవత్సరం విద్యార్థులకు మాత్రమే పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు పరీక్షలకు అరగంట ముందుగానే కేంద్రానికి చేరుకోవాలన్నారు.

అనారోగ్యంతో జూనియర్ అసిస్టెంట్ మృతి



చిన్నయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు

కంబదూరు: మండల కేంద్రానికి చెందిన జూనియర్ అసిస్టెంట్ చిన్నయ్య (52) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందారు. చిన్నయ్య ప్రస్తుతం రామగిరి మండలం పేరూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. గతంలో కంబదూరు, కుందుర్పి మండలాలతో పాటు పలు ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శిగా, వీఆర్వోలుగా పని చేస్తూ మంచి పేరు తెచ్చుకున్నారు. మృతుడికి భార్య మారెక్కతో పాటు కుమారులు బన్ను, టింకు ఉన్నారు. చిన్నయ్య మృతదేహాన్ని జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు,వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్, వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ విభాగం జిల్లా సంయుక్త కార్యదర్శి విల్సన్, నాయకులు రాజు, కిరణ్ అలాగే అధికారులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అల్లర్లు జరగకుండా చూసుకోండి

గుమ్మఘట్ట: ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. గ్రామాల్లో అల్లర్లు, గొడవలు జరగకుండా చూసుకోవాలని తహసీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఫలితాలు వెలువడే వరకూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాలపై నిఘా పెట్టాలన్నారు.

19 మంది బైండోవర్

బొమ్మనహాళ్: మండలంలో కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తూ పట్టుబడిన కేసుల్లో ముద్దాయిలుగా ఉన్న 19 మంది మరోసారి మద్యం అమ్మకుండా ముందస్తుగా బైండోవర్ చేసిన్నట్లు కణేకల్లు సెబ్ సీఐ కిషోర్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని ఉద్దేహాళ్, బొల్లనగుడ్డం, కృష్ణాపురం, బొమ్మనహాళ్ గ్రామాలతో పాటు తదితర గ్రామాలకు చెందిన 19 మందిని బొమ్మనహాళ్ తహసీల్దార్ రామాంజినమ్మ ఎదుట హాజరపరిచామన్నారు. రూ.లక్ష పూచికత్తుతో బైండోవర్ చేసినట్లు వెల్లడించారు. అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయించినా.. సరఫరా చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.